


# ఉదయించిన చైతన్యం

ఏ.యస్.వి. రమణారావు

"కౌసల్యా సుప్రజారామా.... పూర్వా సంధ్యా ప్రవర్తతే.... లేస్తారా శ్రీవారూ.... ఇంకా బజ్జుంటారా స్వామీ ....లేవండీ...."

మొహం మీదకి కప్పుకున్న దుప్పటి తొలగిస్తూ- ముద్దుగా అంటోన్న భార్య మాటలకి- బద్ధకంగా కళ్ళు తెరచి చూసాడు – చక్రవర్తి.

కుంకం రంగు చీరా, అదే రంగు జాకెట్టూ- పచ్చని వెన్నెల పసిమి రంగులో మిసమిసలాడే ఆమె వొంటికి మరింత 'వన్నె' కెక్కిస్తోంటే –

మాఘమాసపు ఉషోదయంలో వెలుగు తాకిడికి విచ్చుకున్న ముద్దమందారంలా: తలంటి పోసుకున్న వొత్తయిన జుత్తు నల్లటి పట్టుకుచ్చులా ఆమె వీపంతా పరుచుకుని, చీకటి జలపాతంలా ఆమె నడుంమీంచి క్రిందకు జారుతోవుంటే–

చిక్కటి కారుమబ్బుల గుంపుల్లో మెరిసే తటిల్లతలా:

కలువరేకుల్లాంటి కళ్ళని తళతళ లాడిస్తో – ఆప్యాయతతో బరువెక్కిన గుండెల్ని అతని గుండెలకి సుతిమెత్తగా హత్తుకుంటో – అతని మొహంలోకి

మొహంపెట్టి నవ్వుతోన్న ఆమె నిండైన పచ్చటి చెంపల మీదకి;

అందమైన ఆ పువ్వుల తోటలోకి — కొబ్బరాకుల సందుల్లోంచి మిలమిల లాడుతూ జారిపడే లేత ఎండ—ముచ్చట పడి ఉరికి — తనకు తక్కువయిన మెరుపులకి 'వన్నె' పెట్టుకునే ముచ్చటయిన ఆ దృశ్యం చూస్తూ రెప్ప వాల్చ లేకపోయాడు — చక్రవర్తి.

అంతటి గొప్ప అందమైన దృశ్యాన్ని తన రెండు చేతుల్తోనూ కావిలించుకుని తన అణువణువులోనూ కరిగించేసుకోవాలనే ఉద్రేకం గుండెల్లోంచి ఉవ్వెత్తుగా ఎగిసి అతని పచ్చటి మొహంలోకి ఎర్రగా తన్నుకొచ్చింది!

భార్యని చూసిన ఏ క్షణానికాక్షణం అలానే అనిపిస్తుంది — చక్రవర్తికి.

కాని —

అలాంటి క్షణాల ప్రతీ మరుక్షణం— ఎర్రబడ్డ పచ్చటి ఆ మొహంలోకి — నిస్సహాయత నీలినీడలా వెంటాడి వొచ్చేస్తుంది. గుండెల్ని పిండేసే ఆ బాధని అణుచుకునే ప్రయత్నంగా లిప్తకాలం భారంగా కళ్లు మూసుకున్నాడతను.

ఆమెకీ అతనికీ మధ్యన ఇరుక్కుపోయిన అతని ఎడమచేతి పిడికిలి బిగుసుకుంది.

భుజం మించి ముందుకు సాగలేక ఆగిపోయిన అతని కుడిచేతి అవశేషం అల్లల్లాడింది ఆక్రోశంతో చేసేదిలేక.

అలాంటి అతని అవస్థని తృటిలో పసిగట్టేస్తుందామె.

పసిగట్టిన క్షణంలో — తన రెండు చేతులూ విశ్వమంత విశాలంచేసి అతన్ని తన అక్కున చేర్చుకుంటుందామె.

చేర్చుకుని — తన గుండెల్లో పొదువుకుంటుందతన్ని.

భారంగా మూసుకున్న అతని కళ్ల నీలిరెప్పల మీద తన పెదవుల అరుణిమ నింపుతుంది. అతి చల్లని ఆమె నవ్వుల కాంతులు వెదజల్లి — అతని మొహంలో కమ్ముకున్న నీలినీడలని చెదరగొట్టాలని నిండు మనసుతో విశ్వ ప్రయత్నం చేస్తుంది.

ఆమె గుండె లోతుల్లోంచి అతని అణువణువులోకీ ప్రవహించే ఆ ఆర్ద్రతకి అతని గుండెలు ద్రవిస్తాయి— అతని కళ్లు చెమరుస్తాయి.

అలా, తడికాబోతున్న అతని కళ్ల మీద ముద్దు పెట్టుకుంటూ.... అతని పచ్చటి నుదుటిమీద చిందరవందరగా అలుముకుని ఉన్న జుట్టును సరిచేస్తో —

"లేవండి మరీ.... అబ్బాయిగారు ఇంకో గంటకో ఘడియకో పుట్టబోతున్నారివాళ.... అంచాత బుద్ధిగా లేచిపోయి ఆ సమయానికల్లా ఎంచక్కా తలంటి నీళ్లు పోసుకునీ కొత్త బట్టలు కట్టుకోవద్దా మరీ.... లెండి లెండి.........."
అందామె అతన్ని లేవదీస్తూ.

ఏ ఏడాదికాఏడది వొక్కో రకంగా

వొకొక్కరి పుట్టిన రోజుల్ని సెలిబ్రేట్ చెయ్యడంలో – ఆమె చూపించే ప్రత్యేకత గొప్ప కళాత్మకంగా వుంటుంది. అందమైన ఆ సందడీ – మధురమైన ఆ అనుభూతీ – మళ్ళీ పుట్టిన రోజు వొచ్చేవరకూ, వో తియ్యటి జ్ఞాపకంవయి గుండెల్ని పట్టుకు వొదలడు.

అతని జీవితంలో ఆమె అడుగుపెట్టిన ఈ పదేళ్ళల్లోనూ జరిగిన ప్రతీ పుట్టిన రోజు పండుగలూ పది రకాల అనుభూతులుగా గుండెల్లో పదిలపరుచుకున్న గొప్ప జ్ఞాపకాలు అతనికి.

నాలుగు సెలవు రోజుల మధ్యలో కలిసొచ్చిన క్రిందటేడు పుట్టిన రోజు – అరకులోయకి ప్రయాణం – కన్నుల పండువయిన పచ్చటి ప్రకృతి వొడిలో, తామిద్దరూ తమ యిద్దరూ ఉత్సాహంతో గంతులేస్తూ గడిపిన క్షణాలు – దాగుడు మూతలాటల నెపంతో, చెట్ల వెనుక చిక్కటి నీడల్లో, పిల్లలకు కనపడకుండా, తన రెండు చేతుల్తోనూ హత్తుకుని, తన అణువణువులోనూ ఆమెని కరిగించేసుకొనే మధురమైన జ్ఞాపకాలు –

నిన్నగాక మొన్న జరిగినట్టనిపిస్తోంది అతనికి.

ఆ క్షణానికీ ఈ క్షణానికీ మధ్య ఏడాది కాలం గిర్రున తిరిగిపోయింది!

తిరిగిపోయిన కాలం – అతని జీవితం మీద తేరుకోలేనంత దెబ్బ తీసి మరీ తిరిగిపోయింది!

అందమైన కుందనపు బొమ్మలాంటి భార్య, అపురూపమైన పిల్లలు, సంఘంలో మంచి పలుకుబడీ అంతస్థూ కలిగించే చక్కటి ఉద్యోగం, మాంచి వయసులో చక్కటి అవయవాలతో పచ్చగా మెరిసిపోయే బలిష్ఠమైన శరీరం చూసేవాళ్ళకి కన్నుకుట్టేంతగా – అన్ని సంపదలతోనూ చీకూచింతా లేకుండా – నిత్య నూతనంగా సాగిపోతున్న అతని అదృష్టం చూసి, వోర్చుకోలేకపోయిన కాలం – కసితో కాటేసిపోయిం దతన్ని!

కలలోనయినా ఊహించలేనంత గొప్ప ఘోరం – కన్ను మూసి తెరిచే అంతలో జరిగిపోయింది! ప్రాణాలకే ముప్పు వొచ్చేంత ప్రమాదాన్ని – వొక్క క్షణంలో గ్రహించి – తెలివిగా తప్పుకోబట్టి – ప్రళయంలా మీదకొచ్చిన లారీ చక్రాల క్రింద కుడి చెయ్యి మిగిలిపోయి – ప్రాణాలు దక్కాయి!

హాస్పిటల్లో స్పృహలోకొచ్చిన మరుక్షణం – చితికిపోయిన మేరకు కుడి చేతిని తీసేసారన్న విషయం తెలిసి మానసికంగా కృంగిపోయాడతను. ఆ షాక్‌నుంచి తేరుకోలేక పోతున్నా డిప్పటికీ అతను. కుడిచేతివేపు చూసుకునే ప్రతిక్షణమూ – అతని గుండె లోతుల్లో బాధ కలుక్కుమంటుంది. జరిగిపోయిన ఘోరం కళ్ళముందు కదిలి ఎదర బ్రతుకంతా మసగ్గా కనపడినప్పుడు – కళ్ళల్లోకి తన్నుకొచ్చే కన్నీటి వరదని ఆపుకోలేడతను!

తన కేర్పడ్డ అవిటితనంతో బయటకు వొచ్చి పదిమందికీ మొహం చూపించా లంటే సిగ్గుగా వుంటుందతనికి.

పరిపూర్ణమైన ఆరోగ్యంతో, తీర్చి దిద్దినట్లుండే అవయవాల సొంపులతో, మేలిమి బంగారం సైతం ఆమె పచ్చటి శరీరంమీద వెలవెలాబోయే వాంటి మెరుపులతో, ప్రపంచంలో వున్న సౌందర్యం అంతా వొక్కచోట కుప్ప పోసినట్లుండే- భార్యచెంత-

వికృతంగా వేలాడే మొండిచేత్తో- నిలబడటానికి సిగ్గుపడి- క్షణక్షణానికీ కుంచించుకుపోతున్నా డతను.

అతనిమీద అతనికే అసహ్యం ఏర్పడి- రోజురోజుకీ బ్రతకడంమీద విరక్తి ఏర్పడుతోంది। కాని-

కేవలం ప్రమాదవశాత్తూ భర్త కేర్పడ్డ అవిటితనాన్ని చాలా తేలికగా తీసుకో గలిగిందామె। దయతో, సానుభూతితో, మునుపటికన్నా ఎక్కువ ప్రేమాభిమా నాలతో, తన గుండెల్లో పొదువుకుంటోం దతన్ని క్షణక్షణం.

చితికిపోయిన అతని చేతిని తొలగిం చేసిన మరుక్షణంలోనే- తన భర్తకో చేయి లేదనేభావం, తన హృదయం లోంచి పూర్తిగా తొలగించేసుకుందామె।

ఆ తలంపు అతనికూడా ఏ క్షణం లోనూ కలగకూడదని- ఆ చేత్తో అతను చేసుకోవలసిన ప్రతి పనికీ తన రెండు చేతులూ అతనికి అంకితంచేసి- కంటికి రెప్పలా చూసుకొస్తూందామె అతన్ని। నిష్కల్మషమైన నిండుపున్నమి వెన్నెల లాంటి చల్లని నవ్వుతో- భర్త కేర్పడ్డ అవిటితనాన్ని నిండు మనసుతో స్వీకరిం చిన ఆమె- అతనిపట్ల అనురాగాన్ని ప్రేమనీ తన గుండెల్లో మరింతగా నింపు కుంటోంది।

అయితే—

ఆమె ఆప్యాయత అతనికి మరింత బాధ కలిగిస్తోంది।

పిల్లల సంరక్షణతోపాటతనికి కూడా సంరక్షణ చెయ్యడంలో- ఉదయం లేచింది మొదలు వొక్కక్షణం విశ్రాంతి లేకపోయినా- మొహంలో అనుక్షణం మెరిసే చిరునవ్వు చెక్కుచెదరకుండా- తన కెలాంటిలోటూ కలక్కుండా చూసు కొస్తున్న ఆమె కేవిధంగానూ సాయపడ లేకపోతున్నందుకు- అతను కృంగిపోని క్షణం అంటూ లేదు।

ఆమె జీవితకాలం ఈ అవిటివాడికి సేవ చెయ్యడంలోనే కరిగిపోతుందన్న భావం ఎంత తొలగించుకుందా మను కున్నా- సాధ్యంకావటంలే దతనికి।

కాని—

తప్పదు.

అతనికా బాధా తప్పదు.

ఆమెకు ఆ శ్రమా తప్పదు.

ఉండుండి ఈ ఆలోచనంతా కమ్ము కొస్తూంటుం దతనికి.

ఆ క్షణాలలో- జరిగింది తలచుకునీ,

జరగబోయేది ఊహించుకుంటూ— నిస్స హాయంగా శూన్యంలోకి చూస్తూ వుండి పోతాడతను.

అలాంటి సమయాల్లో—

అతనిలో చెలరేగే సంఘర్షణని వొక్క చూపులో పసిగట్టేస్తుందామె.

సాధ్యమయినంత వరకూ, అతన్ని ఒంటరిగా వుండనివ్వదు ఆమె.

తలంటుకు బాత్‌రూమ్‌లో అన్నీ సిద్ధంచేసుకుని వొచ్చిన ఆమె—

ఆకాశంవంక శూన్యంగా చూస్తోన్న అతని చూపుల్లో 'తడి' చటుక్కున గ్రహించి—

"స్వామీ బెడ్ కాఫీకోసంవా అనిరీక్షణా? ఇవాల్టికదేం కుదర్దుగానీ....లేవం డ్లేవండి నీళ్లు చల్లారిపోతున్నాయి.... స్నానం చేసేకే అన్నీనూ....లేవండి మరీ—"

అంటూ అతన్ని తన రెండుచేతుల్తోనూ లేవదీసి— బ్రష్ చేతికిచ్చింది ఆమె.

వొక్క ఎడంచేత్తో తనకు తానుగా చేసుకునే పనులు చాలా తక్కువ అతనికి.

చాలా పనులు వొక్కచేత్తోనే చేసుకోగలగటం సాధ్యం కావటంలేదు.

ఏ పనీ తను చేసుకోలేపోతున్నాననే తలంపు తనకి రాకుండా ఏ క్షణాని కాక్షణం తనని కనిపెట్టుకునే వుంటుందామె.

ప్రత్యక్షంగా కానీ, తన పరోక్షంలో గానీ, తనకి సేవచెయ్యటంలో, ఆమె చిరాకుపడటం కానీ, విసుక్కోవటం గానీ, అతను చూడలేదు— వినలేదు.

ఏ క్షణంలోగానీ— ఆమె మొహంలో చల్లని వెన్నెలలాంటి ప్రశాంతత, పెదవులపై అమృతపు జల్లులాంటి చిరునవ్వు —చెక్కుచెదరవు.

ఆరిపోతున్నా— తన సహజగుణమైన పరిమళాన్ని విడిచిపెట్టని మంచి గంధపు చెక్కలా— నలిగి నాశమయిపోతున్నా— తన సువాసనలని పంచిపెట్టకుండా వుండలేని ఆకుసంపెంగలా— కాలిపోతున్నా— వెలుగులు వెదజల్లకుండా బ్రతకలేని దీపకళికలా—

హిమాలయంలా ఎదిగిపోయిన ఆమె ముందు;

అవిటితనంతో ఎందుకూ చాతగాకుండా పనికిమాలిపోయిన తన బ్రతుకువో పిపీలికంలా తోస్తోందతనికి.

ఆ భావంతో కృంగిపోని క్షణం అంటూ లేదతనికి।

ఒక్కొక్కప్పు డనిపిస్తూ వుంటుంది అతనికి."ఈ అవిటితనం తనకు గాకుండా ఆమెకే సంభవించి వున్నట్టయితే, ఆ వికృతాన్ని హృదయపూర్వకంగా తను స్వీకరించి ఉండగలిగేవాడు కాదని."—

అతని ఆలోచనల్లో అతనుండగానే;

తలంటిపోయడం కొత్తబట్టలు తొడగడం— నుదుటిని బొట్టు పెట్టడం— పూజ గదిలోనికి తీసుకువెళ్లి దేవుడిముందు నిలబెట్టి తన ఎడంచేతికి ఆమె కుడిచేతిని

అనించి నమస్కరింప చేయించటం-హారతి ఇచ్చి ఆమె చేతులతో తన కళ్ళకద్దటం- పిల్లలిద్దరిచేతా తన చెరోబుగ్గ మీదా ముద్దులు పెట్టించటం—

క్షణాలలో జరిగిపోయింది.

డైనింగు టేబిల్ ముందు కూర్చుంటూ చూసాడు చక్రవర్తి.

ఎదురుగా పొగలుకక్కుతూ వేడివేడి యిడ్లీ- పెసరట్టు ఉప్మా!

ఏదో మంత్రిస్తే కావలసినవన్నీ వాటంతటవే ప్రత్యక్షమయినట్లు-

చేసినట్టూ చెందినట్టూ ఎక్కడా కన పడకుండా- కావలసినవన్నీ కావలసినట్టూ కోరుకున్నట్టూ- వేళకు వొక్క క్షణం అటూ ఇటూ గాకుండా- అమర్చటంలో- ఆమెకు వుండే గొప్ప ప్రత్యేకత ఎప్పటి కప్పుడు కొత్తగానూ, ఆశ్చర్యంగానూ ఉంటుం దతనికి!

నిజానికి- ఈ చాకిరీ అంతటినీ డబ్బు పెట్టి కొనుక్కోగలిగే ఆర్థికస్తోమతకేం తక్కువలేదు అతనికి.

ఆమె అవస్థ చూడలేక- ఆ మాటే అతనోసారి అంటే-

"ఎవళ్ల పనులు ఎవళ్లకావలసినట్టు వాళ్లు చేసుకోవడంలో పడే శ్రమనుండి కలిగే అందమూ, ఆనందమూ, తృప్తీ, రుచీ- మరోళ్లు ఎంతచేస్తే మట్టుకు వొస్తుందీ-" అందామె నవ్వేస్తూ. అతని విషయంలో అతనికిప్పుడు ఏర్పడ్డ గొప్ప కొరత అదే!

ఆ మాటే అతనెన్నిసార్లు అందామను కున్నాడో- అన్నిసార్లూ అననీకుండా ఆమెచేతుల్తో అతని నోరు సుతారంగా మూసేస్తుందామె.

అసలు తను అలా ఏ క్షణంలోనూ అలా అనుకోకుండా వుండాలని ఆమె పడే తాపత్రయం అంతా ఇంతా కాదు.

"ఆగండాగండి....ముందు పాయసం తిన్నాకనే అవన్నీ-" అంటూ వొచ్చి చెమ్చాతో పాయసంతీసి కాసేపు ఊది అతని నోటికందించిందామె.

"వినయ్ ... సుధా.... మీరుకూడా నాన్నగారి కొక్కో చెమ్చా పాయసం తినిపించండమ్మా...." అందామె పిల్లల వంక చూసి.

పిల్లలిద్దరూ ఎగిరి గంతేసి తండ్రికి చెరోప్రక్కా చేరి నేను ముందంటే నేను ముందంటూ చెరో చెమ్చా పాయసం అందించారు.

వాళ్ల గుండెల్లో పొంగిపొరలే అను రాగంలాగే ఆ పాయసంకూడా ఘుమ ఘుమలాడుతూ అతని అణువణువూ తియ్యదనం నింపేసింది?

భార్యనీ పిల్లల్నీ వొకేసారి దగ్గిరకు తీసుకుని గుండెల్లో పొదువుకోవాలని పించిందతనికి ఒక్కసారి. కాని- సువిశాలమైన వాళ్ల అభిమానాన్ని కౌగ లించుకోడానికి వెయ్యి చేతులేనా చాలవే- వొక్క ఎడంచేత్తో తన కెలా సాధ్యపడు తుందది- అన్న తలంపు కమ్ముకొచ్చిం

దతనికి. విలవిలలాడిన అతని గుండెల్లోని అంజడి మొహంలోకి తన్నుకొచ్చింది!

తన "చాతకానితనం" తనకి గుర్తు రాకుండా చేయాలని, ఆమె విశ్వ ప్రయత్నం చేస్తున్నకొద్దీ - ప్రతి సంఘటనా పనిగట్టుకు మరీ ఎదురొచ్చి వెక్కిరిస్తోం దతన్ని!

కానీ—

తనలో ఎప్పటికప్పుడు కొత్త ఉత్సాహాన్ని కలిగించాలనే తాపత్రయంతో- ఎంతటి శ్రమనైనా లెక్కచెయ్యకుండా- తన బ్రతుకులో ప్రతీక్షణాన్నీ నవ్వుల పువ్వులతో నింపాలని—ఆమె చేసే ప్రతి పని వెనుకా- ఆమె పెంపొందించుకునే ఆత్మవిశ్వాసాన్ని;

తను క్షణక్షణం వ్యక్తపరిచే బాధతో వమ్ముచేస్తూ పోతే;

ఆమె చేసే ప్రయత్నంలో ఏదో 'లోపం' వుందనే భావం ఆమెని కలవరపరిస్తే;

ఆమెపట్ల తనెంత అపకారం చేస్తున్నట్టూ-అన్న పరిశీలన కలిగింది చక్రవర్తిలో.

'తను ఉత్సాహంగా వున్నట్టు కేవలం నటించినా చాలు- ఆమెకు కొండంత ధైర్యం కలగటానికి' అని మనసులో అనుకున్న మరుక్షణం—

"—ఊఁ.... అయితే ఏంటివాళ మన కార్యక్రమం? టూకీగా చెప్పేయి... ఆఫీసుకి ఇలా వెళ్ళి అలా వొచ్చేస్తాను వొక్క క్షణంలో...." అన్నాడు భార్య అందిస్తూంటే ఫలహారం చేస్తూ.

"ఆఫీసా? నథింగ్ డూయింగ్. ఫోన్‌చేసి చెప్పేయండి ఆఫీసుకు రావటం లేదని. ఇవాళంతా మనం కలిసుండాల్సిందే....పిల్లలూ మీరుకూడా ఈ రోజు స్కూల్‌కి "డుమ్మా" కొట్టీడఁవే—" అందామె.

"అది కాదు జానకీ.... రెండూ మూడు అర్జంటు ఫైల్సున్నాయి.... ఎడ్వైజస్ ఇచ్చేసొచ్చీడఁవే.... ఎంతసేపు.... వో గంటలో వొచ్చీనూ...." అన్నాడు చక్రవర్తి కాఫీ సిప్‌చేస్తూ.

"వీల్లేదన్చెప్పినప్పుడు వినాలి మరి. ఆ ఇచ్చే సలహాలేవో ఫోన్లోనే యిచ్చేయండి. పదండి పదండి డయల్ చేద్దాం ఆఫీసుకీ...." అంటూ అతన్ని హడావుడి చేసేసిందామె.

"జానకీ.... మరి నువ్వు వంట చెయ్యాలి....తయారవాలి.... ఈ లోపలనే వెళ్ళొచ్చీనూ.... జస్ట్ వొన్నవర్ ఏం వెళ్ళొచ్చెయ్యనా మరీ.... ఊఁ...." నసిగాడు చక్రవర్తి.

పదేళ్ళ నుంచీ తన మేధస్సునంతా వినియోగించి, రాత్రనక పగలనక తన శక్తినంతా ధారపోసి, తమ కంపెనీకి లక్షలకు లక్షలు లాభాలు చేకూర్చిపెట్టడమే గాకుండా, ఇతర దేశాలకు తమ వ్యాపారాన్ని విస్తృతపరచి, మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకునేలా,

తమ కంపెనీని అభివృద్ధి పరచిన చక్రవర్తిని- ప్రమాదంలో కుడిచెయ్యి పోగొట్టుకున్నా-నిర్లక్ష్యం చెయ్యకుండా, నిరాదరం చెయ్యకపోవడమే గాకుండా- అహర్నిశలూ అతను చేసిన సేవను గుర్తుంచుకుని, తమ కంపెనీకి "చీఫ్ ఎడ్వయిజర్"గా ఉన్నత పదవిలో నియమించి-అతని కలిగిన కష్టానికి తమ సానుభూతినీ, వెనక తామున్నామని కొండంత ధైర్యాన్నీ, చూపించారు, కంపెనీ యజమానులు. అందువల్ల, వారిపట్ల కృతజ్ఞతతోనూ, తనపై వుంచిన గురుతరమైన బాధ్యతలపట్ల విధేయతతోనూ ప్రవర్తించే చక్రవర్తికి ఆఫీసు కెళ్లకుండా వుండాలంటే మనసొప్పదు వొకంతట. చెయ్యి పోయినద్గగర్నుంచీ అతను ఆఫీసుకొచ్చి వెళ్లటానికి కారు పంపిస్తోంది కంపెనీ. అలాంటప్పుడు వోసారెళ్లి ముఖ్యమైన ఫైల్సు చూసొచ్చేస్తే బావుంటుందని అతనుద్దేశం. పనిపట్ల అతనికుండే శ్రద్ధ ఎటువంటిదో జానకికి బాగా తెల్సు. అయినా ఆమె ఈ రోజు నిర్ణయించుకున్న ప్రోగ్రాం ప్రకారం అతనీరోజు ఆఫీసు కెళ్ళటం ఆమె కిష్టం లేదు. అందుకే అతని నసుగుడు విని ఆమె మూతి ముడుచు కూర్చుంది.

అంత చిన్న విషయానికి ఆమె మనసు నొప్పించడం ఇష్టంలేని చక్రవర్తి ఎడంచేత్తో ఫోనుమీంచి రిసీవర్ తీసి పట్టుకుని "డయల్ చెయ్యి మరీ" అన్నట్టు చూసాడు ఆమె వేపు.

ఆమె ఎగిరి గంతేసి డయల్ చేసింది.

పక్కా పావుగంటసేపు మాట్లాడి తర్వాత, మౌత్‌పీస్ పక్కకు వుంచి "కారు అక్కర్లేదా మనకీ" అడిగాడామెని. "వొద్దన్నట్లు" ఆమె సంజ్ఞ చెయ్యగానే- "దట్సాల్" అని రిసీవర్ పెట్టేసి-

"ఓ. కె-ఇప్పుడు చెప్పు మరి....మన ప్రోగ్రాం ఏవిటో-" అన్నాడు చక్రవర్తి రిలాక్సింగ్‌గా కాళ్లు బారజాపుకుని.

"మీరలా పిల్లలతో కమ్మగా కబుర్లు చెబుతూ కూర్చొండీ...." అంటోన్న ఆమె మాటని మధ్యలోనే అందుకుని;

"ఈ లోపల నువ్వు కమ్మగా వంట చేసొచ్చేస్తావు. దెన్ ..." అన్నాడు చక్రవర్తి.

"అందరం కలిసి అలా సరదాగా బజారుకెళ్లి ...."

"ఈ పుట్టినరోజు జ్ఞాపకార్థం వో చక్కటి ఆర్ట్‌పీస్ కొనుక్కుని ఎంచక్కా ఇంటికొచ్చేసి...."

"ఏంటి కొంటారు నాన్నగారూ?" మాటల మధ్యలో దూరుతూ అడిగింది కూతురు సుధ.

"కానే వరకూ ఏం కొంటుందో చెప్పదు తల్లీ మీ అమ్మా...అందుకని..." అంటూన్న తండ్రి మాటని పూర్తిచేస్తూ-

"మనం అంతవరకూ అడక్కూడదు" అన్నాడు కొడుకు వినయ్.

"దట్స్ గుడ్" కొడుకు తెలివి తేటలకి కాంప్లిమెంట్స్ పాస్‌చేస్తూ— భార్యవంక చూసి;

"తర్వాత" అనడిగాడు నవ్వుతూ.

"వొస్తూ- మాంచి స్టుడియో కెళ్లి అందరం కలిసి ఫొటో తీయించుకునీ..." జానకి అంటుండగనే చక్రవర్తి మోహం వివర్ణమయింది.

అందమైన జానకి ప్రక్కన మొండి చేత్తో అసహ్యంగా నుంచున్న తమ రాబోయే ఫొటో ఊహించుకున్న చక్రవర్తి కళ్లల్లోకి నీలినీడలు పాకురు కొచ్చాయి!

కాని— వెంటనే—

నిజ జీవితంలో పదిమంది మధ్య ఆమె ప్రక్కన నడుస్తూ వెళ్ళగాలేంది ఎవరోగాని చూడని ఫొటోలో నిలబడితే వొచ్చిన చిన్నతనం పెద్దగా ఏం వుంటుంది కనక- అని తనకు తానే సమాధానపడి- అంత చిన్న విషయానికి కాదని, ఆమెని నొప్పించడం దేనికని—

"ఫొటో తీయించుకు నొచ్చేయడం వేనా? అక్కణ్ణుంచింకెక్కడ కన్నా వెళ్లాలా? అప్పటికి నాకు మాంఛి ఆకలే వేస్తూంటుంది బాబూ" అన్నాడు మామూలుగా తన ధోరణిలోకి తానొచ్చేసి.

క్షణంలోనే సర్దుకున్నా ఆ క్షణంలో సగంలో అతని మనోభావాన్ని పసిగట్టే సింది జానకి. పదిమందిలోనూ తామిద్దరం కలిసి మునుపటిలా తిరగడం, ఫొటోలు తీయించుకోడం, ప్రతీ క్షణాన్నీ సరదాగా గడపటం, ఇవన్నీ— "చెయ్యి లేకపోయినంత మాత్రాన తన జీవితాని కొచ్చిన లోటేం లేదు"— అన్న ధైర్యం జీవించడం పట్ల ఉత్సాహం— అతనిలో బలపరచడానికే- ఆమె పనిగట్టుకు చేస్తోంది. అందువల్ల-ఆ విషయమై అతనో క్షణం కలవరపడ్డా ఆమె తన ప్రతిపాదనని వెనక్కు తీసుకోలేదు— "పోన్లెండి మీ కిష్టం లేకపోతే వొద్దు లెండి" అని అన్లేదు.

"నాకూ ఆకలేస్తుంది బాబూ" అంది సుధ-తండ్రిమాటకు వంతపాడుతూ.

"అప్పటిదాకా ఎందుకూ-వో గడీ పోతేనే వేస్తుంది అకలి నీకు" అన్నాడు వినయ్ చెల్లి మాటలకి వెక్కిరింపుగా.

"వెధవా నీకు వెయ్యనట్టూ" అంది జానకి గలగలా నవ్వుతూ.

"అందరికీ వేస్తుం దాకలి వొక్క నీకు తప్ప—" అన్నాడు చక్రవర్తి ఆమె వేపు చూసి నవ్వుతూ.

"ఫొటో అయ్యాక ఇంటి కొచ్చేసి భోజనాలు చేసి- ఏంచక్కా నాలుగు గంటల దాకా పడుకుని లేచి మాంఛి సినిమా కెళ్లొస్తాం...." అంది జానకి ఆ రోజు కార్యక్రమాన్ని పూర్తిచేస్తూ.

"వెళ్లొచ్చిన తర్వాతా" ఇంకా పూర్తి కాలేదన్న ధోరణిలో-జానకివంక చిలిపిగా చూస్తూ అడిగాడు చక్రవర్తి.

ఆ చూపు వెనకా—ఆ మాటలోని—

అంతర్యాన్ని గ్రహించిన జానకి అంద మైన కళ్ల సిగ్గు బరువు నింపుకుని చూసా యత్నన్ని.

"తర్వాత ఏం చేస్తాంమ్మా" ఇదేంవీ తెలియని సుధ అడిగింది తల్లిని—తండ్రి వాళ్లో కూర్చుని.

"అక్కణ్ణుంచి మీ నాన్నగార్నడ గండి" అంటూ లోపల కెళ్లి పోతున్న జానకికి వెనకనుంచి చక్రవర్తి నిండుగా నవ్వుతోన్న నవ్వూ-అందులోని అంతరార్థమూ, వినిపించి ఆమె అణువణువూ పులకరించింది.

అనాడు - నిండు నవ్వులతో తమ బ్రతుకులన్నీ పండాలని మనసారా కోరుకుంటూ వంటపనిలో పడింది జానకి.

• • •

అనుకున్న ప్రకారం, అనుకున్న వేళలలో, అమలు జరపవలసిన వన్నీ, ఏ మాత్రం తేడా రాకుండా, అందంగా, ఆనందంగా, జరిపించడంలో, ఆమెకు అమే సాటి అని, మరోసారి నిరూపించు కున్న జానకి—తన భార్యగా, గర్వంతో, ప్రతి క్షణం మురిసిపోయాడు చక్రవర్తి -ఆ రోజల్లా.

ఊరికి చివరగావున్న సినీమాహల్లో- పాతదేఅయినా "మాయాబజార్" సినీమా ఇదివరలో చాలా సార్లు చూసినా—తెలుగులో వొచ్చిన కొద్ది "గొప్ప" చిత్రాల జాబితాలో ముందు వరసలో నిలుచో బెట్టాల్సిన "గొప్ప సాహిత్యపు-సంగీతపు విలువలతో నిండిన చక్కటి కళాఖండం" ఎన్నిసార్లొచ్చినా చూడాల్సిందేననిపట్టుబట్టి, తీసుకొచ్చింది జానకి.

సినిమా ఆద్యంతమూ రసవత్తరంగా వున్నట్టే-

సినిమాహాలు బయటకు వొచ్చేసరికి పుచ్చపువ్వు లాంటి నిండు పున్నమి వెన్నెల ప్రకృతి అంతా పరుచుకుని—చాలా అహ్లాదంగా వుంది.

పెద్ద సినీమా కాబట్టి విడిచిపెట్టేసరికి పది గంటలయింది.

పాత సినీమా వోటీ, ఊరు చివరోటీ అయినందున, పల్చగా వొచ్చిన జనం, సినీమా విడిచిపెట్టగానే, తలోదారీ చెల్లా చెదురయిపోయారు అయిదు నిముషాల్లో.

నిర్మానుష్యంగా వున్న దారంతా వెన్నెల పరుచుకుని చూడ ముచ్చటగా వుంది.

మాఘ మాసపు చలిగాలి వెన్నెలలో తడిసి వీస్తోంది మెల్ల మెల్లగా.

ఆహ్లాదంగావున్న అ వాతావరణంలో కాస్త ఆలశ్యమైనా, నడిచివెళ్తేనే బావుంటుందనిపించింది చక్రవర్తికి.

"నడిచి వెళ్దాం జానకీ" అన్నాడు.

ఆమెకీ వెన్నెట్లో కబుర్లు చెప్పుకుంటూ నడవాలనే సరదాగా వుంది. కాని—

"పిల్లలు నడవలేరండీ-రిక్షాలో వెళ్లిపోదాం" అంది.

"మేం నడవగలం" అన్నారు పిల్లలిద్దరూ ఉత్సాహంగా.

"మధ్యలోకొచ్చి నడవలేమని అనండి చెప్తాను–" అంది జానకి నవ్వుతూ.

"అనం అంటే అనం" అన్నాడు వినయ్.

"అంటే అప్పుడే కట్టించుకోవచ్చు రిక్షా....పద జానకీ" అన్నాడు చక్రవర్తి.

అన్నా చెల్లీ చెట్టాపట్టా లేసుకుని వాళ్లకన్నా ముందే నడుస్తున్నారు.

చక్రవర్తీ జానకీ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

పచ్చటి వాళ్ల వొంటిమీద వెన్నెలపడి మెరుస్తోంది.

తెల్లటి చీరా తెల్లటి జాకెట్టులో వెన్నెట్లో నడిచొస్తున్న మల్లెపూవ్వులా వున్న జానకిని చూస్తూ నిగ్రహిం కో లేకపోతున్న చక్రవర్తి నడుస్తూ నడుస్తూ రకరకాల చిలిపిచేష్టలు చేస్తుంటే–ముందు హుషారుగా పరుగులాంటి నడకతో వెళ్తూ మధ్యలో ఆగి వెనక్కి చూస్తునప్పుడల్లా–

"పిల్లలు" అంటూ ఎడంగా జరిగి నడుస్తోంది జానకి.

తలంటి పోసుకుని వొదులుగా వేసుకున్న వొత్తయిన ఆమె జడ కుడిభుజం మీంచి నిండైన గుండెలమీంచి నడుం దాటి జారిపడుతూ– ఆ చిక్కటి జడలో విరిసిన మల్లెలు నీలాకాశంలో కుప్ప పోసిన నక్షత్రాల్లా నవ్వుతూ వుంటే;

తీర్చి దిద్దినట్లుండే ఆమె శరీరంలో ప్రతీ వొంపుమీద వెన్నెల ఉరికి ఆడుకుంటూంటే–

ఆ అద్భుత సౌందర్యాన్ని తనివితీరా చూస్తూ–తిన్నగా నడవలేక పోతున్నాడు చక్రవర్తి

అతని అవస్థ చూసి ముసిముసిగా నవ్వుకుంటూ నడుస్తోంది జానకి.

సగం దూరం నడిచేసరికి పిల్లల హుషారు తగ్గి–తల్లిని వొకళ్లూ, తండ్రిని వొకళ్లూ పట్టుకుని ఈడిగిలపడి నడుస్తున్నారు.

పిల్లల అవస్థా, మొగుడి ఆత్రుతా, గ్రహించిన జానకి 'రిక్షా దొరికితే బావుండు' ననుకుంది ఇప్పుడిప్పుడే ఎదుగుతోన్న ఆ ఊరి చివర ఎక్కడ పడితే అక్కడ రిక్షా దొరికే సందడి ఇంకా పుంజుకోక పోవటంతో–కనుచూపు మేర రిక్షా కాదుకదా మనిషి అలికిడైనా లేదు. ఇలా నడిస్తే మరో అరగంట క్కాని ఇల్లు చేరలేరు. టైమూ హస్తే పదిన్నర దాటుతోంది. "రిక్షా దొరికే వరకూ నడవక తప్పదు–వొచ్చే వంతెన దాటితే దొరకొచ్చు" అనుకుంది జానకి.

మాటామంతీ లేకుండా నడుస్తోన్న భార్యని చూసి–

"ఏవిటి జానకి ఆలోచిస్తున్నావ్" అడిగాడు చక్రవర్తి.

"ఏం లేదు–రిక్షా దొరికితే బావుండునని చూస్తున్నాను" అని జానకి అనే టప్పటికి వంతెనమీద కొచ్చారు.

"ఇంకెంత దూరం–వొచ్చేసాంగా" అన్నాడు చక్రవర్తి.

వంతెన కటూ ఇటూ నిశ్చలంగా వున్న ఏటినీళ్లమీద వెన్నెల ముక్కలు ముక్కలుగా పడి తళుక్కు మంటూ చూడ ముచ్చటగా వుంది.

ఏటికావొడ్డునీ ఈ వొడ్డునీ దట్టంగా ఉన్న సీతాఫలపు తోటల మీద నిశ్శబ్దంగా కురుస్తోన్న వెన్నెల స్నానాలు చేసోస్తున్న గాలి కమ్మటివాసన వేస్తోంది.

నిశ్శబ్దం ఎంత అందంగానూ—మరెంత మధురంగానూ—ఇంకెంత ఆహ్లదంగానూ—వుంటుందో, నిరూపిస్తోంది—కనుచూపు మేర కనిపిస్తోన్న ఆ ప్రదేశ మంతా.

—అంతలోనే, వున్నట్టుండి—

ఎక్కణ్ణుంచి తరుముకొస్తుందో—ఎప్పణ్ణుంచి వేటాడుకొస్తోందో—

కారు మబ్బుల గుంపొకటి—పొంచి వుంది—అదును చూసి—నిండు చందమామని పొట్టన పెట్టుకున్నది.

ఆ చీకటిలో దిక్కు తోచని గాలి వెర్రెత్తి వీచడం మొదలెట్టింది.

అంతవరకూ వెన్నెల మెరుపులతో ఆడుకున్న ఏరు—నిశ్శబ్దంగా ఏడుస్తున్న ట్టుంది.

ఇదే అవకాశం అని—అక్కడా అక్కడా దూరంగా వున్న పిల్ల మబ్బులు కూడా పరుగెత్తుకు వొచ్చి చేరి—మరింత చీకటి పులిమాయి ప్రకృతి మీద.

—హఠాత్తుగా, దారంతా చీకటి మయమయిపోవడంతో, పిల్లలు - తల్లి నొకళ్లూ, తండ్రి నొకళ్లూ, అంటుకు పోయారు. వొక్క ఎడం చేత్తో నే ఖాతుర్నెత్తుకుని—

"పద జానకీ.... బాబూ వినయ్ త్వరగా నడు.... వొర్షం వొచ్చేలా వుంది—" అని చక్రవర్తి అంటున్నాడో—లేదో—

అంతవరకూ, వంతెన గట్టమీద, పొంచివున్న నలుగురు బలిష్ఠమయిన వ్యక్తులు, చీకటిలో చీకట్లలా, వాళ్ల నలుగుర్నీ—చుట్టుముట్టేసి:

"—ఆగండి బే....అడుగు ముందు కేసినా.... అరవాలని ప్రయత్నించినా—పొడిచి పారేస్తాం—" వాళ్లలో—వొకడు కత్తి చూపిస్తూ బెదిరించాడు.

ఈ హఠాత్పరిణామానికి చక్రవర్తి స్థంభించిపోయాడు.

జానకి నిశ్చేష్ఠురాలయిపోయింది.

పిల్లలు బిక్కచచ్చిపోయారు.

వొక్క నిముషంలో సర్దుకున్న చక్రవర్తి—

"మా దగ్గిరున్నవన్నీ తీసిచ్చేస్తాం—ప్రాణాలతో వొదిలెయ్యండి మమ్మల్ని... జానకీ—గొలుసూ గాజులూ తీసిచ్చెయ్ వాళ్లకి...." అన్నాడు ఖాతుర్ని దింపి, ఎడం చేత్తో జేబులో వున్న పర్సు తీసి వాళ్ల ముందుకు చాచి.

"అయన్నీ మీ రియ్యకపోయినా మేం లాక్కోగలం బే ..మాక్కావల్సిందీ... లడ్డు ండలాంటి ఈ గుంట..." అంటోన్న ఆ నలుగుర్లో వొకడిని—

చాచి కొట్టాలనిపించింది చక్రవర్తికి. చాతకాక—

"నోర్మూయ్‌రా రాస్కెల్.... నోటి కొచ్చినట్టు పేలకు...." అన్నాడు కోపంతో ఊగిపోతూ.

"అరవకు. అరిచి గీపెట్టినా నీకు దిక్కెవడూ రాడిక్కడికి. వాచ్చినా అణ్ణీ నిన్నూ ఒకే పోటుతో పొడిచి పారే స్తాను. దాన్ని మా కొడిలేసి నీ దారి న్నువ్వింటి కెళ్లు. తెల్లారేలోపు వొది లేస్తాంలే- ఈ లోపల్నువ్వు పోలీసులు గీలుసులని కూసేవో—చంపి పారేస్తాం దాన్నీ ఏట్లోనే—పిల్లల్ని తీసుకుని ప్రాణాలతో మరేదగా నోర్మూసుకు ఇంటి కెళ్లు—" అని మిగతా ముగ్గురివేపు చూసి "తోట్లోకి లాక్కెళ్లండ్రా దాన్ని" అన్నాడు.

వాడి మాటలు విని, జానకి మీదకు రాబోతున్న ఆ ముగ్గురి మీదకూ, వొళ్లు తెలీని కోపంతో విసురుగా వెళ్లి అటకా యించబోయిన చక్రవర్తి నొ—సీక మీద చెయ్యేసి వొక్క తోపు తోసేసరికి—వెల్ల కిలా క్రిందపడిపోయాడు. క్రింద పడి పోయిన తండ్రిని చూసి ఏడుపు లంకించు కున్న పిల్లలిద్దరి నోళ్లూ మూసి;

"దాన్ని లాక్కెళ్లండ్రా ఎదవ నా కొడకల్లారా—" అంటూ ఆ ముగ్గుర్నీ ఉరిమిచూసి; లేవబోతున్న చక్రవర్తి గుండెలమీద కాల్తో తొక్కి నేలకేసి అదిమిపెడ్తూ;

"పిచ్చిపిచ్చిగా గొడవచేసావా— పిల్లి లిద్దర్నీ ఏట్లోకి విసిరేసి- నిన్ను పొడిచి పారేయగలను—" అన్నాడు ఆ గుంపుకి సారథ్యం వహిస్తోన్న నాయకుడు.

ఆ సంఘటనతో జానక్కి మతి పోయింది. కళ్లముందు జరుగుతోంది నిజమేనన్న నిర్ధారణకొచ్చిన మరుక్షణం —ఆమె వాళ్ల ముగ్గురి చేతుల్లోనూ వుంది. జరగబోయే ఘోరాన్ని వొక్క క్షణంలో ఊహించుకున్న ఆమె గజగజ వొణికి పోతూ- వాళ్ల ముగ్గురి చేతుల్లోంచి పెను గులాడి తప్పించుకునొచ్చి నాయకుడి కాళ్లు పట్టుకుని;

"మా కున్నదంతా ఊడ్చి పెట్టి ఇచ్చేస్తాం- మమ్మల్నొదిలిపెట్టీ అన్నా" దీనంగా ఏడ్చింది.

"వదలవే... అన్నా అంటే కరిగిపోయి వొగ్గేస్తా ననుకున్నావేటే.... వొగ్గేస్తాన్లే తెల్లారేలోప లొగ్గినా...." అంటూ ఆమె జుత్తు పట్టుకుని లేవదీసి సందిట్లో ఇరికించుకుని—

"చెప్పే... నీ మొగుడితో చెప్పు— పిల్లల్ని తీసుకుని ఇంటి కెళ్లిపోమని చెప్పే- నోరూరించే నిన్ను అనుభవించ కుండా ఎలాగూ వొదిలేది లేదు- ఆడినీ, పిల్లల్నీ చంపేసయినా ఎత్తుకుపోతాం నిన్ను- వుత్తిపున్నేనికి ప్రాణాలెందుకు తియ్యడంవనొగ్గేస్తన్నాను- ఎల్లిపొమ్మను —ఎల్లి ఈ రాత్రి కళ్లుమూసుకున్నాంగో మను- చెప్పే—" జానకి వొళ్లంతా అబగా తడుంవుతూ- అంటోన్న వాడిని చూసి—

వొంట్లో రక్తం ఉడుకెత్తిపోయింది చక్రవర్తికి- లేచి ఎదిరించాలని గింజుకుంటున్నకొద్దీ వాడు బలిష్ఠమయిన కాల్తో అణగతొక్కుతున్నాడు.

'లొంగిపోక తప్పదు- ఎదిరిస్తే వాళ్ల ప్రాణాలు తీసయినా తనని నాశనం చెయ్యక తప్పదు- తన ఖర్మమిట్లా కాలి బూడిదయింది- వాళ్లయినా ప్రాణాలతో మిగిలుంటే—' అన్న నిశ్చయానికొచ్చిన జానకి.

"పదండి వొస్తాను- వొదిలేయండి వాళ్లని—" అంది ముఠా నాయకుడితో.

ఆమె మాటలు విన్న చక్రవర్తి వొణికిపోతూ—

"జానకీ—" పెద్దగా అరిచాడు.

"అరవకు- ఇదుగో నీ పిల్లలు- తీసుకుని నోర్మూసుకుని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లు- చెప్పింది గుర్తుంది కదా- పోలీసురిపోర్టూ గట్రా యిచ్చి గొడవచేసావని మాకు ఉప్పు అందిందో- ముందు నీ పెళ్లాన్ని, తర్వాత నిన్నూ, పిల్లల్నీ పొడిచిపారేస్తాను-లే, లేచెళ్లు-" అన్నాడు ముఠా నాయకుడు జానకిని మిగితా ముగ్గురికీ అందిస్తూ.

"వెళ్లండి- పిల్లల్ని తీసుకుని వెళ్లిపోయి ప్రాణాలు దక్కించుకోండి- నా గురించాలోచించకండి" వాళ్ల ముగ్గురి చేతుల్లోనూ యిరుక్కున్న జానకి- చక్రవర్తివేపు చూసి అంటూ, రెండు చేతులూ జోడించింది.

"చస్తే అందరం చద్దాం వొకేసారి... ఈ రాస్కెల్స్ చేతుల్లో నువ్వు.... జానకీ..." అంటూ మీదకు రాబోతున్న చక్రవర్తిని, మళ్లీ వొక్క తోపుతోసి-

జానకిని ఎత్తుకుపోతున్న వాళ్ల ముగ్గురితోనూ కలిసి అడ్డుదారంట వంతెన దిగి చీకటిలో కలిసిపోయాడు ముఠా నాయకుడు.

వాళ్లవెంట పరుగెత్తుకువెళ్లి జానకిని రక్షించాలని ఊగిసలాడుతున్న చక్రవర్తికి-

"అమ్మా....నాన్నగారూ... అమ్మ-" అంటో పెద్దగా ఏడుస్తోన్న పిల్లల్ని వొదిలి వెళ్లడానికి కాళ్లాడలేదు. ఏడుస్తోన్న పిల్లలిద్దర్నీ ఎడంచేత్తోనే దగ్గరకు తీసుకుని- జానకిని తీసుకెళ్లిపోయిన వేపే- నిశ్చేష్ఠుడయి చూస్తూ నిలబడిపోయాడు!

అప్పటిగ్గాని- మబ్బుల్లోంచి బయట పడలేని చంద్రుడు- మళ్ళీ ఊరంతా వెన్నెల ధారపోస్తున్నాడు.

పిల్లల్తోపాటు మిగిలిపోయిన చక్రవర్తికి-

ఆ వెలుగూ- ఆ వెలుగులో కనపడే ప్రతీ అణువూ- నిర్జీవంగా కనపడుతున్నాయి. పిల్లలిద్దరూ బల్లుల్లా అంటుకుపోయారు తండ్రికి.

ఉండుండి- "అమ్మా" అని ఎలుగెత్తి అరుస్తోన్న పిల్లల ఏడుపులు- శ్మశాన వాటికలా- చేతనారహితంగా- మిగిలి

పోయిన ఆ ప్రదేశంలో— హృదయ విదారకంగా ప్రతిధ్వనిస్తున్నాయి.

ఊళ్ళో నుంచి సైకిళ్ల మీద వొస్తోన్న ఇద్దరు— వీళ్ల దగ్గిరగా వొచ్చేసరికి బ్రేకులు వేసి ఆపి, "ఏం జరిగింది సార్" అనడిగారు- అచేతనంగా నిలబడిపోయిన చక్రవర్తినీ, అతన్నంటుకుపోయి ఏడుస్తోన్న పిల్లల్నీ చూసి.

మండిపోతున్న చక్రవర్తి గుండెలకు ఆ పలకరింపు వినబడి, దుఃఖం కమ్ముకొచ్చింది.

"వొక్క క్షణం మీరు ముందొచ్చుంటే నా జానకి నాకు దక్కి వుండేది. జానకీ" అంటూ చిన్నపిల్లాడిలా బావురుమన్నాడు.

వెక్కి వెక్కి "జానకీ" అంటూ ఏడుస్తోన్న అతన్ని సముదాయిస్తూ- జరిగిన ఘోరం తెలుసుకోడానికి పది నిముషాలు పట్టింది వాళ్లిద్దరికి. తెలుసుకున్న మరుక్షణం కోపంతో ఊగిపోతూ-

"ఎలా వెళ్లారు సార్ వాళ్లు.... మీ రిక్కడే వుండండి సార్... వొంతెన దిగువన మనుష్యులున్నారు.... తీసుకొచ్చి.... ఆ వెధవల్ని పట్టుకుని కాలూ చెయ్యీ తీసేద్దాం-" అంటూ సైకిళ్ళని వెనక్కి తిప్పేసేరు ఉద్రేకంతో.

వాళ్ల మాటలతో జరగబోయే గొడవ ఊహించుకునే సరికి- జానకి నెత్తుకు పోతూ ముఠా నాయకుడు చేసిన హెచ్చరిక చటుక్కున గుర్తొచ్చి- వెళ్లేవాళ్ళని ఆపుతూ—

"వొద్దు- ఏ మాత్రం గొడవచేసినా నా జానకిని వాళ్లు నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు- వెళ్లొద్దు- వాళ్ళ చేతుల్లో కత్తులూ, పిస్తోళ్లూ వున్నాయి- నేను చూసాను- ఏమాత్రం అలికిడయినా నా జానకిని వాళ్లు బ్రతకనివ్వరు-" గుండె చెరువు చేసుకుంటూ అంటోన్న చక్రవర్తిని చూసి "ఆ బాబన్నదీ నిజంవేరా- కసాయి నాకొడుకు లేంచేసినా చేస్తారు" అన్నాడు ఆ యిద్దర్లో వొకడు వెనక్కి తగ్గి.

"మీరు మాత్రం ఏం చేస్తారాసార్ యిక్కడ నిలబడి- పిల్లలు బెంగతో వొణికిపోతున్నారు- పదండి- మిమ్మల్నీ పిల్లల్నీ యింటి వరకూ దిగబెట్టొస్తాం" అన్నారు వాళ్లు మానవ సహజమయిన దయతో.

"వొచ్చేస్తుంది నా జానకి-వాళ్లొదిలేస్తాం వన్నారు- వొదిలీగానే వొచ్చి వెతుక్కుంటుంది నన్నూ పిల్లల్నీ- నేను రాను- నా జానకి నా కళ్ళబడే వరకూ నేను రాలేను- మీ రెళ్లండి-" అన్నాడు చక్రవర్తి దుఃఖంతో మాటలు తడబడ్తూ.

"మళ్లీ వొద్దాం సార్ మనం.... పిల్లల్ని చూడండి చలికిలా వొణికిపోతున్నారో... వాళ్ళని యింటికి తీసుకెళ్లి ఎవళ్ళకన్నా అప్పచెప్పి మనం వొద్దాం సార్.... పదండి- మా మాట వినండి సార్."

అని వాళ్లిద్దరూ- చక్రవర్తినీ పిల్లల్నీ బలవంతంగా కదిలించి- ఇద్దరు పిల్లల్నీ

సైకిళ్ళ మీద కూర్చోపెట్టుకుని- వొకతని సైకిలు వెనక చక్రవర్తిని కూర్చోమని- వో పది నిముషాల్లో యింటికి చేర్చారు- వాళ్లిద్దరూ.

చక్రవర్తీ, పిల్లలూ, యింట్లోకి వెళ్ల గానే—ఆ యిద్దరూ కలిసి, చుట్టుపక్కల యిళ్లవాళ్లని లేపి, జరిగిన ఘోరాన్ని వివరించి-దుఃఖంతో తల్లడిల్లిపోతున్న వాళ్లని వోదార్చమని చెప్పగానే—

జానకి మంచితనం, ఇరుగుపొరుగుల పట్ల ఆమె చూపించే ఆదరాభిమానా లెరిగిన ఆడవాళ్లు ఇంట్లోకి వెళ్లి-బెంగతో మంచాన్నతుక్కుపోయిన పిల్లల్ని చేర దీసి, బుజ్జగించి, 'అమ్మా' ని మారాం చేస్తోన్న "వస్తుందమ్మా....వొచ్చేస్తుంది బాబూ" అంటూ మరపించి అన్నం తిని పిస్తున్నారు.

చీకటి గదిలో, మంచంమీద, వొస్తోన్న దుఃఖాన్ని అదిమి పట్టలేక, గుండెలు చెరువయ్యేలా ఏడుస్తూ, తన అశక్తతకి తల బాదుకుంటున్నాడు చక్రవర్తి.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయిన పిల్లలు నిద్రలోకూడా, వుండుండి, "అమ్మా"ని పలవరిస్తున్నారు. ఆడవాళ్లు వాళ్లపక్కనే కూర్చున్నారు.

చుట్టుపక్కల యిళ్లల్లోని మొగ వాళ్లు చక్రవర్తి యింటి గుమ్మంలో కూర్చుని-చెయ్యాల్సిందేవిటో తోచక-ప్రపంచంలో ఎంతెంత ఘోరాలు జరుగు తున్నాయో-ముచ్చటించుకుంటున్నారు.

"పదండి వంతెన మీద కొద్దాం- వాళ్లు ఆమెని తీసుకొచ్చి వొంటరిగా వొదిలేస్తే-దిక్కుతోచని ఆ పిల్ల ఏ ఘోరాని కొడిగడ్తుందో-" సైకిళ్లతో వొచ్చిన యిద్దరిలో-వొకడన్నాడు. ఆ మాటలు విన్న చక్రవర్తి చటుక్కున లేచి బయటకు వొచ్చి "పదండి" అన్నాడు.

"నువ్వెందుకు బాబూ-మేం వెళ్తాం- నువ్వుండు-నిద్రలోనుంచి పిల్లలేకివేళ లేస్తే, వాళ్లకి నువ్వు కనపడకపోతే మరీ భయపడిపోతారు-నువ్వు లోపల పిల్లల దగ్గిరుండు బాబూ" అన్నాడు పక్కింటి పెద్దాయన.

"మీరుండండి సార్ మేం వెళ్లి చూసొస్తాం" అన్నారు సైకిళ్లతో వొచ్చినవాళ్లు.

"వాళ్లకి మీరంతా గుంపుగా కనప డితే—నా జానకిని నాకు దక్కనియ్యరు ఆ దుర్మార్గులు" అన్నాడు చక్రవర్తి భయంగా.

"వాళ్లకకనపడకుండా తలో మూలా నుంచుంటాం బాబూ-పరవాలేదు-పిల్లల దగ్గిరుండు బాబూ నువ్వు" అంటూ కది లారు వో అయిదారుగురు, సైకిళ్లతో వొచ్చిన వాళ్ళు ముందు నడుస్తూంటే.

వాళ్లు వెళ్లినవేపే చూస్తూ నిలబడి పోయిన చక్రవర్తికి—

"పిల్లలకిప్పుడే నిద్రపట్టింది-లోప లకు వెళ్లండి బాబూ-అవసరమైతే పిలవండొస్తాం-"

వెనక నుంచి వినిపించడం—లోప లున్న ఆడవాళ్లు గుమ్మం దిగి వాళ్ల యిళ్లకు వెళ్లిపోవడం వొకేసారి జరగ టంతో—

నిశ్శబ్దంతో బావురుమంటున్న ఇంట్లోకి వెళ్లాలనిపించక—నిలుచున్న చోటే చతికిలపడి ఆ వీధి చివరకు కన పడే రోడ్డువంక చూస్తూ—వీధి చివర్న ఏమాత్రం అలికిడి అయినా—వెళ్లిన వాళ్లొస్తున్నారేమోనని, జానకిని తీసు కొస్తున్నారేమోననీ ఆత్రంతో అదు ర్దాతో నిలబడుతూ-కాకపోవటంతో నిరు త్సాహ పడుతూ-గుండెల్ని మెలితిప్పే బాధతో భయంతో-భరించ శక్యంకాక పోయినప్పుడు "జానకీ-ఎంత పనయిపో యింది జానకీ—ఆ రాక్షసులకు నిన్ను అప్పచెప్పేసి, ప్రాణాలు కాపాడుకోడా నికి, పిరికిపందలా వొచ్చేసాను జానకీ— నన్ను క్షమించు జానకీ—జానకీ—" గుండెలు బాదుకుని ఏడుస్తున్నాడు.

లోపల పిల్లలు నిద్రలో ఉలిక్కిపడి లేచి "అమ్మా"ని కలవరిస్తూ, కళ్లు నులుము కుంటూ "నాన్నగారూ... అమ్మ... అమ్మ రాలేదా నాన్నగారూ" అని ఏడ్చినప్పు డల్లా "వస్తుంది తల్లీ.... తప్పకుండా వస్తుంది బాబూ" అంటూ వొచ్చే కన్నీ టిని ఆపుకోలేక-వాళ్లని, వొక్కచేత్తోనే గుండెల్లో పొదువుకుని—

"వొచ్చెయి జానకీ.... వేగం వొచ్చెయి.... నువ్వులేని ఈ యింట్లో నాకు భయంగా వుంది— ఈ పిల్లల్ని పట్టుకోలేకపోతున్నాను భగవంతుడా నా జానకిని ప్రాణాలతో దక్కించు తండ్రీ" ఎలుగెత్తి అరుస్తున్నాడు పిచ్చివాడిలా.

'వొస్తుందా జానకి? ఆ రాక్షసుల చేతుల్లో మానం కోల్పోయిన జానకి ... అవును - ఇంతవరకూ పవిత్రంగా వున్న ఆమె శీలం నాశనమయిపోయుంటుంది- రేపట్నుంచి ఈ ప్రపంచం అంతా ఆమె "చెడిపోయిన ఆడది"గా ముద్ర వేసి చూస్తుంది. 'అవిటివాడు కాబట్టి మరో దారిలేక - చాతకాక - ఏలుకుంటున్నా డంటుంది. ఇంతవరకూ గౌరవంగా బ్రతికిన జీవితం తెల్లారితే ప్రతిఒక్కడికీ హీనాతిహీనమయిపోతుంది. వొకసారి చెడిపోయిన ఆడదాన్ని ఈ సంఘం చూసే ప్రతీ చూపులోనూ 'కోర్కెల కోరలు' చాచుకునే వుంటాయి. తన చాత కాని తనం లోకువగా తీసుకుని ఆమెని వేటాడ్డం ప్రారంభిస్తాయి. ప్రతీ 'వాడి' కళ్లూ. తన కోసం - పిల్లల కోసం, వెంటబడి బెదిరించిన ప్రతీవాడిచేతుల్లోనూ ఆమె .. ఆ నీచమైన బ్రతుకు బ్రతకడం కంటే చావడం మంచిది. ఈ సరికే బ్రతుకు బజార్నపడింది. 'వాడి కళ్లెదుట వాడి పెళ్లాన్ని పరాయివాడనుభవిస్తుంటే ఈ అవిటివెధవ చూస్తూ కూర్చున్నాడు'- రేపట్నించీ ప్రతివాడూ తనని చూడగానే అనుకునే మాటల్ని తను భరించలేడు. సంఘంలో తన పరువూ ప్రతిష్ఠా మంట

కలిసిపోతుంది. చెడిపోయిన ఆడదానికి పుట్టినవాళ్లుగా తన పిల్లల భవిష్యత్తు నాశనమయిపోతుంది. కాలం బ్రతుకు మీద వేసిపోయిన మచ్చని సంఘం బ్రతికున్నన్నాళ్లూ పరిహసిస్తుంది – అతి పవిత్రంగా గడిపి రావణాసురుడి బారి నుంచి బయటపడినా, శ్రీరామచంద్రు డంతటివాడు, ప్రపంచానికి జడిసి, సీతని అగ్నిపరీక్షకు నిలబెట్టక తప్పలేదు. ఆ సంఘం మారలేదు – ఆ మనుష్యులు మారలేదు – చెడిపోయిన ఆడదానికి ఈ సంఘంలో ఆశ్రయంలేదు–బ్రతుకులేదు. శిలాన్ని పోగొట్టుకుని వొచ్చే జానకిని పరిగ్రహిస్తే ఈ సంఘం తననీ చిన్న చూపు చూస్తుంది – చాతగానివాడికింద జమకట్టి లోకువ చేస్తుంది. ఆ బాధ ఇంతకన్నా భయంకరమైంది. ఆ అవ హేళన బ్రతుకంతా మోస్తూ బ్రతకలేడు తను–'

ఇలా – దారిమళ్లిన ఆలోచనతో – చక్రవర్తిలో మరో మనిషి తల ఎత్తి అణువణువూ పెరగడం ప్రారంభించేడు. చాలా యుగాలుగా ప్రతీ 'మగాడి'లోనూ దాక్కున్న ఈ విచిత్రమయిన 'మనిషి' ఎక్కడో అట్టడుగున నరనరాల్లోనూ పొంచివుండి సమయం వొచ్చినప్పుడు తన 'ఉనికి'ని గుర్తు చేస్తూ, పైకొచ్చి, ఆక్రమిస్తాడు। 'వాడి' విజృంభణకు తట్టుకోలేక అసలు 'మనిషి' క్రమంగా నిర్జీవమయిపోతాడు।

కాని, ఈ పరిణామదశలో–వివేకాన్ని కోల్పోకుండా, బూజుపట్టిపోయిన భావ తరంగాల తాకిడికి ఎదురీది, మానవత్వపు విలువలను మహోన్నత శిఖరాలమీద నిలబెట్టగలిగే, అభ్యుదయ భావ సాంప్రదాయాలకు సుస్వాగతమివ్వగలిగే – హృదయ వైశాల్యాన్ని ప్రదర్శించ గలిగితే, అత్యుత్తమ మానవత్వపు విలువలు నిండిన నవ సమాజ నిర్మాణానికి అన్ని వేపుల నుండీ అంకురార్పణ జరుగుతుంది।

ఆ మహోదయపు ప్రచండ కాంతి పుంజాలను కళ్లెత్తి చూడగలిగే మనః స్థైర్యాన్ని కూడగట్టుకునే క్షణంలో –

అతి నీచమైన, మానవ సహజమైన బలహీనతల ప్రభంజనం తాకిడికి తట్టుకుని నిలబడగలగాలి ప్రతీ మనిషీ।

ఆ దోలాయమాన స్థితిలో ఊగిస లాడే భయంకరమై క్షణాలతో సతమత మవుతూ, కళ్లు మూసుకుని, విచిత్ర మయిన అవస్థలోపడి, కొట్టుకుంటున్న చక్రవర్తికి– వున్నట్టుండి–

వీధిలో, హడావిడిగా అవుతోన్న, మనుష్యుల అలికిడి వినపడగానే–

చటుక్కున కళ్లు తెరిచి, వొళ్లో పడు కున్న పిల్లల్ని నెమ్మదిగా తీసి పక్కన పడుకోబెట్టి– అదుర్దాగా, పరుగెత్తుకువెళ్లి, వీధి గుమ్మంతలుపు తెరిచేసరికి–

అవతల– గుమ్మం దిగువన– కంగారుగా తిరుగుతోన్న మనుష్యుల మధ్యకి,



యువ

ఎవరో- నీళ్ల వోడుతూన్న 'జానకీ శవాన్ని' మోసుకొచ్చి దింపుతోన్న 'దృశ్యం' కళ్లపడేసరికి—

"జానకీ" అని— దిక్కులు ప్రతిధ్వనించేలా— వొక్క గావుకేక పెట్టాడు.

— ఆ కేకకి, హడిలిపోయిన పిల్లలిద్దరూ లేచిపోయి- నిద్రలోనే ఏడుస్తోన్న తండ్రిని పట్టుకుని కుదిపేస్తూ—

"నాన్నగారూ. . అమ్మ వొచ్చిందా... ఏదీ.... అమ్మా.... అమ్మేది నాన్నగారూ ...." అని, ఏడుస్తూ, పిల్లలు పెడుతోన్న గోలకి—

తుళ్లిపడి లేచి, మగతలోంచి తేరుకుని, కళ్లు నులుముకుని, చుట్టూ చూసాడు. వేసిన తలుపులు వేసినట్టే వున్నాయి.

గదిలో నూ, బయటా, భయంకరమైన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

"అయితే.... జానకి.... జానకిశవం ...." అంటూ గొణుక్కుంటూ, అనుమానం తీరక, లేచెళ్లి వీధి గదితలుపులు తెరిచి, గుమ్మ లోకొచ్చి నుంచుని, వీధి కొసాకీ చూసేడు. పచ్చపువ్వులాంటి వెన్నెల్లో ఊరు ఊరంతా గాఢనిద్రలో మునిగివుంది.

వెన్నెల వెలుగుని చూసి, తెల్లారిపోయిందేమో ననుకుని, వుండుండి, కాకులు అరుస్తున్నాయి, అక్కడా, అక్కడా.

"అంతా భ్రమేనన్నమాట—" అనుకున్నాడు, ఊపిరి పీల్చుకుంటూ.

పిల్లలు పడుకున్నారో, లేదో నని చూసి— తడారిపోయిన గొంతులో నీళ్లు పోసుకుని వొచ్చి గుమ్మంమీద చతికిలపడి, వొచీ చూసాడు. మూడు గంటలు దాటి పరుగెడ్తోంది కాలం. పన్నెండు గంటల ప్రాంతంలో వెళ్లిన మనుష్యుల జాడ కనిపించటంలేదు. ఈ చలిలో, మంచులో తడుస్తూ, తన జానకికోసం, వంతెనమీద కాపలా కాస్తోన్న, వాళ్ల మంచితనానికీ, మానవత్వానికీ, చక్రవర్తి కళ్లు చెమర్చాయి.

—మళ్లీ ఆలోచనలు చుట్టుముట్టేయి అతన్ను.

'ఇందాకట్లా, తను పడింది భ్రమే అయినప్పటికీ, ఎంత భయంకరంగా వుంది. పసిమిపచ్చ రంగులో, పచ్చపూల వెన్నెల్లా అనుక్షణం నవ్వుతూ, తన కోసమూ, పిల్లలకోసమూ, అహర్నిశలూ శ్రమపడే, గొప్ప హృదయం కలిగిన- జానకిని- నిర్జీవంగా ఎలా ఊహించగలిగాడూ తను. తన హృదయంలో ఎక్కడో మారుమూల పొరల్లో -ప్రమాదవశాత్తూ పవిత్రతని కోల్పోయిన జానకి, మరణించాలనీ, మరణిస్తే ఈ సంఘంలో తను రేపట్నుంచీ ఎదుర్కోబోయే సమస్యలకి శాశ్వత పరిష్కారం ఏర్పడుతుందనీ, ఎంత నీచంగా ఆలోచించగలిగాడు తనూ. తను ప్రమాదంలో చెయ్యి పోగొట్టుకున్న రోజున- ఆమె- ఆమె చెయ్యి

పోయినట్లు పరితపించిన క్షణం ఎలా మరిచిపోగలిగాడూ. ఆ క్షణంనుంచీ తనకో చెయ్యి లేదనే ధ్యాసే తనకి కలగకుండా, అమె రెండు చేతులూ తనసేవకే అంకితంచేసి, తనని కంటికి రెప్పలా చూసుకుంటున్న- తన ప్రాణంలో ప్రాణమయిన జానకిని- హఠాత్తుగా ఏర్పడిన దుష్పరిణామానికి, తన ప్రాణాలూ, పిల్లల ప్రాణాలూ కాపాడ్డం కోసం తనని తాను అహుతి చేసుకుని, ఆ రాక్షసులు జరిపే అమానుషమైన మారణహోమంలో సమిధలా బలికావటానికి సిద్ధపడి వెళ్లిన జానకిని—చనిపోవాలని క్రూరంగా ఆలోచించిన తనలో ఎంత రాక్షసత్వం వుందీ—ప్రమాదంలో చేతిని కోల్పోయి, ఎందుకూ పనికిరాని అవిటివాడుగా మిగిలిపోయిన తన గురించి, ఆమె ఏమాత్రం మరోలా ఆలోచించి వుండినా,తన బ్రతుకు ఏమయిపోయేదీ—తన ఎడల ఆమె చూపించే అవ్యాజమైన అనురాగానికీ, దయతో తన పరిస్థితి పట్ల హృదయపూర్వకమయిన సానుభూతితో అనుక్షణం అమృతపు ధారలా ఆమె నిష్కల్మషమయిన మనసులోంచి ప్రవహించే అభిమానానికీ, ఆమె పట్ల తను చూపించే కృతజ్ఞత ఇదేనా— ప్రమాదవశాత్తూ 'శీలం' పోగొట్టుకున్నంత మాత్రాన ఆమె 'అంటరానిదయి' పోయిందా- ఆ మాత్రానికే ఆమె మరణించాలని శపించడమేనా—అసలు ఈ 'శీలం' అంటే 'భౌతికమా'? 'మానసికమా'?— తన గురించి తప్ప కనీసం కలలో కూడా మరో మగవాడి గురించి, మరోలా, ఆలోచనేరాని ఆమె, ఊహించని హఠాత్పరిణామానికి మరో దారిలేక మూడు నిండు ప్రాణాలని నిలబెట్టడానికి చిత్రహింసకు సైతం సిద్ధపడిన, ఆమె 'శీలం' లేనిదా? సంకుచిత దృక్పథంతో, జాలీ దయా కోల్పోయి, ఇంత అమానుషంగా, దారుణంగా ఆలోచించగలిగే తనకు 'శీలం' వున్నట్టేనా? కేవలం ఆలోచనల్లోనయినా 'శీలం' నిలబెట్టుకోలేకపోయిన తనకంటే; వాకళ్ల బ్రతుకుల్ని నిలబెట్టడానికి మరణం కంటే దారుణమైన సంక్షోభానికి తలవొగ్గడంలో శారీరకమైన 'శీలం' పోగొట్టుకున్న ఆమె, ఎన్ని లక్షల రెట్లు ఎక్కువా? తనకు సంభవించినట్లే ఆమెకు సంభవించిందీ కేవలం ప్రమాదంగానే ఎందుకు భావించలేకపోతున్నాడూ- ఆమెకు ఎదురయిన పరిస్థితిని ఎందుకని దయతో స్వీకరించి గుండెల్లో దాచుకోకూడదూ— ఆమెకు సంభవించిన ప్రమాదానికి తన చాతకానితనం కొంత కారణం కాదా— తనకు ప్రాణబిక్ష పెట్టిన ఆమెను కేవలం 'శీలం' పేరిట, ఈ సంఘంకోసం బహిష్కరించడంలో తనకున్న "శీలం" గొప్పతనం ఏమిటనీ—అంత 'అమానుషంగా' 'రాక్షసంగా' ఆలోచించగలిగే తనకూ, కండకావరంతో నిస్సహాయ

మయిన పరిస్థితుల్లో చిక్కిన ఆడదాన్ని— బలవంతంగా నయినా అనుభవించాలనుకునే హృదయంలేని ఆ రాక్షసులకీ, తేడా ఎక్కడుందీ—చదువూ, ప్రపంచ జ్ఞానమూ, వివేకమూ వున్నాయనుకున్న తను ఇంత సంస్కారహీనంగా ఆలోచించ గలిగితే, స్త్రీకి రక్షణ ఎక్కడుందీ— పదేళ్ల కాపురం చేసీ, ప్రాణంలో ప్రాణంగా మసిలీ, కష్టంలోనూ సుఖంలోనూ—జీవితంలో ఎదురయిన ప్రతి సమస్య పట్లా—ఆదరణలనీ, ఆలోచననీ పొందీ, తను తప్ప మరో ప్రపంచం లేదనే భావనతో తన నీడలో మనుగడ సాగాలని అనుక్షణం కోరుకునే ఆమెకి భర్తగా, తనే ఆదరించి సానుభూతితో, "నేనున్నానని" రక్షణ కలిగించన్నాడు, ఇన్నేళ్లుగా కొనసాగించింది 'ఆదర్శ దాంపత్యం' అనుకోడంలో అర్థం ఎక్కడుందీ ?—

ఇలా— పదును తేరిన ఆలోచనలతో మానవత్వానికీ, వ్యక్తిత్వానికీ మెరుగు పెట్టుకోవటంతో, సంస్కారంతో రంగరించిన సుస్థిరమైన నిర్ణయంతో, వొక ఖచ్చితమైన నిర్ధారణా, ఎటువంటి సడలింపులూ లేని వొక మహోన్నత నిశ్చయమూ, చక్రవర్తి మొహంలో నిర్మలంగా ప్రకాశిస్తోన్న క్షణంలో—

వీధి చివర మలుపులో సందడి ప్రారంభయింది. మరు నిముషంలో మలుపు తిరిగి వొస్తోన్న మనుష్యుల హడావుడీ, వారి వెనుక నెమ్మదిగా వొస్తోన్న రిక్షా కళ్లబడేసరికి, ఆత్రుతతో తడబడుతూ లేచి నుంచున్న చక్రవర్తి గుండెల్లో ఆందోళన క్రమక్రమంగా అధికమవుతోంది.

"నా జానకిని నాకు సజీవంగా దక్కించు భగవాన్" అని ఆ వొక్క క్షణంలో లక్షసార్లు అనుకున్నాడు. ఎటువంటి వార్త వినాల్సొస్తుందోనని, అతని అణువణువూ ఆత్రంగా ఎదురు చూస్తోంది. గుమ్మంలో నుంచున్న చక్రవర్తిని చూసి అంతవరకూ నడుస్తూన్న మనుష్యులు పరుగెత్తుకు వచ్చారు.

ఆ గుంపులోనున్న పక్కింటి పెద్దాయన, గుమ్మం ఎక్కుతూ— "మన జానకమ్మ తల్లి మనకు దక్కింది బాబూ" అని, చక్రవర్తితో అంటోండగా, ఆగిన రిక్షాలోంచి దిగి, తల వొంచుకుని, నిలబడిన జానకి— ప్రచండ విలయతాండవంతో, ప్రకృతి నంతా చిన్నాభిన్నం చేసిపారేసిన పెనుతుఫాను తాకిడికి, దారుణంగా బలియిపోయి, బెదిరిపోయే పూల తీవెలా; కర్కశమైన చేతుల్లో, ఘోరంగా నలిగి, రేకులు వీడి, నాశనమయిపోయిన బొండుమల్లెలా వుంది. అపాదమస్తకమూ, అపవిత్రమైపోయినానన్న సిగ్గూ—దిగులూ కమ్ముకునిపోయి, పవిత్ర ఆలయం లాంటి ఆ ఇంటి ప్రాంగణంలో, కలుషితమైన తన

పాదం మోపడానికి కూడా సంకోచిస్తూ నిలబడిపోయిన, జానకిని చూసి-

"లోపలకెళ్లు తల్లీ" అన్న పెద్దాయన మాటకు- అంత మందిలో అక్కడ నిలబడ్డవూ, అంతమందిచేతా 'లోపలి కెళ్ళమ్మా' అని అనిపించుకోవటంవూ— సిగ్గనిపించి, వొక నిర్ణయాని కొచ్చినట్లా, వొక్క వుదుట్లో, లోపలకు వెళ్ళిపోయిందామె.

"లోపల కెళ్లు బాబూ...వెళ్ళి, పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతున్న ఆ పిల్లకి ధైర్యం చెప్పి వోదార్చు బాబూ" అని, మిగిలిన వాళ్ళవేపు చూసి "పదండెళ్దాం" అంటూ, కదలబోతున్న పెద్దాయన్నీ, మిగిలిన వాళ్లనీ చెమర్చిన కళ్ళతో చూస్తూ-

"మీరంతా నాకు చేసిన ఈ గొప్ప సహాయానికి, రెండు చేతులూ జోడించి మనఃపూర్వకంగా నమస్కారం కూడా చేయలేని అసహాయుణ్ణి. ఈ రాత్రంతా చలిలో మిమ్మల్నందర్నీ శ్రమ పెట్టాను- మన్నించండి- మీరు చేసిన మేలు మరిచి పోలేను, ఈ జన్మకే కాదు ఏ జన్మకీ తీర్చుకోలేనిది మీ ఋణం-" అంటూ, జేబులో దొరికిన డబ్బు తీసి, పెద్దాయన చేతుల్లో వుంచుతూ

"ఖర్చయి వుంటుంది - వుంచండి" అన్న చక్రవర్తి, వాళ్ళంతా కనుమరుగయిందాకా వుండి, లోపల కొచ్చి ముందుగదిలో చూసాడు, జానకి కోసం.

ఆ ప్రగాఢ నిశ్శబ్దంలో, జానకి అలికిడి వినిపించకపోయేసరికి, పడగ్గదీ, డైనింగు హాలూ, పూజ గదీ, వంట గదీ వెతికినా కనపడక పోయేసరికి, కంగారుగా పరుగెత్తుకుని పెరట్లోకొచ్చి చూసేసరికి, బాత్‌రూమ్‌లో లైటు వెలుగుతూండటం కనిపించి,ఊపిరి పీల్చుకున్నాడు. అయినా, అనుమానం తీరక- బాత్‌రూమ్ దగ్గిర కొచ్చి— "జానకీ" అని పిలిచాడు. బదులయితే రాలేదు గానీ, లోపల్నుంచొస్తోన్న 'కిరసనాయిలు వాసన' గుప్పుమని కొట్టేసరికి- లోపల, జానకి తలపెట్టోన్న 'ఘోరం' కళ్లల్లో కొచ్చి, అంత చలిలోనూ, చెమటలు కమ్మేసాయి చక్రవర్తికి. కాళ్లూ, చేయీ, ఆడలేదొక్క క్షణం. అంతలోనే తేరుకుని- బలమంతా కూడదీసుకుని తలుపు మీద వొక్క తాపు తన్నేసరికి, రేకు తలుపేమో, వూడొచ్చింది అప్పటికే, కిరసనాయిల్తో వొళ్ళంతా తడుపుకుని అంటించుకోడానికి సిద్ధపడుతున్న, జానకి-హఠాత్తుగా, తలుపు విరగొట్టి, లోపలకు వొస్తోన్న భర్తని చూసి—

"వొద్దు....రాకండి.....నన్ను తాకొద్దు నేను మైలపడిపోయాను శాశ్వతంగా.... కళంకమయిన ఈ నికృష్టపు బ్రతుకు బ్రతకలేను....పవిత్రమయిన మీ నీడను తాకే అర్హత లేని పాపిష్ఠిదాన్ని.... వెళ్లండి.... ఈ భ్రష్ఠురాలిని మరిచిపొండి.... వెళ్ళండీ...." పిచ్చిగా కేకలు

వేస్తూ, గుండెలు పగిలేలా ఏడుస్తూ, గోడ కంటుకుపోయి, తల బాదుకుంటోంది. ఆమె చెప్పిందంతా విన్న చక్రవర్తి వొక్కమాట మాట్లాళ్లేదు. మౌనంగా, ఆమె ప్రక్కనేవున్న కిరసనాయిలు డబ్బా ఎడం చేత్తో ఎత్తి అందులో మిగిలిందంతా తన వొంటిమీద పోసుకుని, డబ్బా విసిరేసి, కిందపడున్న అగ్గిపెట్టెని తీసి, ఆమె ముందుకు చాపి- "కానీ.... అగ్గిపుల్ల వెలిగించు జానకీ.... ఇన్నేళ్లూ, యిద్దరం కలిసి వొకటిగా బ్రతికాం.... యిద్దరం కలిసి వొక్కటిగానే మరణిద్దాం.... తన కళ్లముందు, పరాయి మొగాళ్లు భార్యని బలత్కారంగా లాక్కెళ్లిపోతూంటే, కళ్లప్పగించి చూసే 'చాతకాని' మొగాడింతకన్నా భార్యకు చేసే ఉపకారం వేవుంటుంది కనక.... రా.... ఆలశ్యం చేయకు.... మళ్లీ పిల్లల్లేస్తారు.... వూం.... వేగం కానీ—" ధృఢమయిన నిర్ణయంతో, నిశ్చలంగా అంటో, నిబ్బరంగా నిల్చుని చూస్తోన్న అతని నిర్మలమైన కళ్ళల్లోకి చూసిన జానకి, అతని కాళ్లమీద పడిపోయి, బావురుమంది. చక్రవర్తి వొంగుని, వొక్క చేత్తోనే ఆమెను లేవనెత్తి, తన గుండెలకు హత్తుకుంటూ- "పిచ్చి జానకీ- నువ్వే లేకపోతే, ఈ చేయ్యిలేని అవిటివాడి బ్రతుకేవయిపోవాలి జానకీ....నోరులేని పిల్లలేవయిపోతారు.... మమ్మల్నందర్నీ దిక్కుమాలినవాళ్లని చేసి...." అంటోన్న అతని నోటికి చెయ్యి అడ్డుపెడ్తూ, అతన్ని తన అణువణువూ హత్తుకుంటూ, మరింతగా అతన్ని పెనవేసుకుపోయి, గుండెలోతుల్లోంచి కమ్ముకొచ్చే దుఃఖాన్నదుపులో పెట్టలేక, వలవలా ఏడుస్తోన్న జానకిని అలా పొదివి పట్టుకునే బయటకు తీసుకొస్తూ— "జానకీ.... మన నిష్కల్మషమైన ఆలోచనల్లో- నిర్మలాంతఃకరణంతో ఆచరించే పనుల్లో- వొకరి ఎడల వొకరు పెంపొందించుకునే అవగాహనల్లో- "శీలం" పొగొట్టుకోకుండా, బ్రతికే మన ప్రతిక్షణమూ అతిపవిత్రమైనదే జానకీ-" అంటోన్న చక్రవర్తి నిర్మలమైన చిరునవ్వుమీద- వేగుచుక్క వెలుగు మొలిచి తళుక్కుమంది. అంతవరకూ వాళ్లిద్దరి మధ్యా నీడలా వున్న చిరుచీకట్లను అప్పుడే వీచడం మొదలెట్టిన 'తూర్పుగాలి' చెదరగొట్టి తరిమికొట్టింది!!

---

వచ్చే సంచికలో

పురాణం సుబ్రహ్మణ్య శర్మగారి

## నాకు నచ్చిన నా కథ

---